

బస్టాండ్ విస్తరణ
మంచిర్యాల బస్టాండ్ విస్తరణపై ఆర్టీసీ యాజమాన్యం దృష్టి సారించింది. డిపోకు ఉన్న కొద్దిపాటి స్థలాన్ని సద్వినియోగం చేసుకునేలా కసరత్తు జరుగుతోంది. 8లో▸



జర పదిలం..!
సెలవుల నేపథ్యంలో విద్యార్థులు ఇళ్లకు చేరుకున్నారు. ప్రమాదకర ప్రాంతాలకు ఈతకు వెళ్లే అవకాశం ఉండటంతో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
39.1 /26.8

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండ, ఉక్కపోత ఉంటుంది.

న్యూస్‌రీల్

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



భోజనాలు పరిశీలిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

రెబ్బెన(ఆసిఫాబాద్): ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. మండలంలోని గోలేటి విలేజీలో గల ఆశ్రమ ఉన్నత పాఠశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్య, వైద్యం, భోజనాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ మెరుగైన విద్య అందించాలని ఆదేశించారు. సబ్జెక్టుల వారీగా అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. దోమలతో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. ప్రతిరోజూ వంటగది, స్టోర్‌రూం, తాగునీరు, మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాలు పరీక్షించారు. ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని సూచించారు. ఆర్వో ప్లాంటు పనిచేయకపోవడంతో పిల్లలు బోర్‌వెల్ నీటిని తాగడంపై ఆరా తీశారు. మెనూ సక్రమంగా పాటించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. శానిటేషన్ సక్రమంగా లేకపోవడంతో హెచ్‌ఎం రవీందర్, వార్డెన్ మోహన్‌దాస్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

మైనార్టీలు యువ వికాసం వినియోగించుకోవాలి

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం పథకాన్ని జిల్లాలోని మైనార్టీలు వినియోగించుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి అబ్దుల్ నదీం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులు సంబంధిత ఎంపీడీవో కార్యాలయంలోని ప్రజాపాలన కేంద్రంలో దరఖాస్తులు, ధ్రువపత్రాల జిరాక్సులు సమర్పించాలని సూచించారు. రాజీవ్ యువ వికాసం పథకం కింద రూ.50వేల విలువైన యూనిట్లకు వందశాతం రాయితీ, రూ.లక్ష విలువైన యూనిట్లకు 90శాతం, రూ.2లక్షల విలువైన యూనిట్లకు 80 శాతం, రూ.2లక్షల నుంచి రూ.4లక్షల వరకు విలువ గల యూనిట్లకు 70 శాతం రాయితీని రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ ద్వారా అందిస్తారని పేర్కొన్నారు.

నూతన మెనూ అమలు చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మెనూ పకడ్బందీగా అమలు చేయాలని మైనార్టీ సంక్షేమ జిల్లా అధికారి అబ్దుల్ నదీం అన్నారు. జిల్లా కేంద్రంలోని మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో బుధవారం మైనార్టీ గురుకులాల ప్రిన్సిపాళ్లు, వసతిగృహాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2025– 26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కాగజ్‌నగర్ రెండు గురుకులాల్లో పీఎంశ్రీ పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు.

రాంజీగోండుకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: స్వాతంత్ర్య పోరాట యోధుడు, ఆదివాసీ ముద్దుబిడ్డ మర్సుకోల రాంజీగోండు వర్ధంతిని జిల్లా కేంద్రంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు మాలశ్రీ మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం జరిగిన తొలితరం ఉద్యమంలో అనేక మంది ఆదివాసీలు బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. ప్రస్తుతం ఏజెన్సీలోని సహజ సంపద, ఖనిజ వనరులను బహుళజాతి కంపెనీలకు దొడ్డిదారిలో దోచిపెడుతున్నారని ఆరోపించారు. జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్, నాయకులు నైతం రాజు, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

తడిసిన స్తంభాలు తాకొద్దు

ఆసిఫాబాద్: వర్షాలు పడిన సమయంలో తడిసిన స్తంభాలను తాకొద్దని ట్రాన్స్‌కో ఎస్ఈ రాథోడ్ శేషారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈదురుగాలులు, వర్షాల సమయంలో విద్యుత్ వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలన్నారు. తెగిన, వేలాడిన, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను తాకొద్దన్నారు. బట్టలు ఆరేసేందుకు ప్లాస్టిక్ వైర్ ఉపయోగించాలని సూచించారు. వ్యవసాయ పంపు సెట్ల వినియోగంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, స్టార్టర్లకు విధిగా ఎర్త్ చేయాలన్నారు.



కాగజ్‌నగర్ పట్టణంలోని కాపువాడకు చెందిన బెజ్జూర్ మాజీ ఎంపీపీ దోకే రోజారమణి మంగళవారం ఉదయం ఇంటి ముందు ముగ్గు వేస్తుండగా ఇద్దరు దొంగలు ఆమె మెడలో నుంచి మూడు తులాల బంగారు పుస్తెల తాడు లాక్కెళ్లారు. ఈ ఘటన జిల్లాలో కలకలం రేపింది. ఉదయం 6 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని ఇద్దరు యువకులు మాస్కులు వేసుకుని వచ్చి ఇంటి వద్ద పూలు కోస్తామని అడిగారు. చెట్టుకు పూలు లేవని చెప్పడంతో కొంత దూరం వెళ్లి.. మళ్లీ తిరిగి వచ్చి ముగ్గు వేస్తున్న మాజీ ఎంపీపీపై దాడి చేసి గొలుసు లాక్కెళ్లారు. ఇంటి వద్ద కొద్దిరోజులు ఇద్దరు యువకులు రెక్కీ నిర్వహించారని బాధితురాలు తెలిపారు.

ఆసిఫాబాద్ మండలం మానిక్‌గూడలో ఈ నెల 26న అంగన్‌వాడీ కార్యకర్త పద్మ విధులు ముగించుకుని ఆసిఫాబాద్ వెళ్లేందుకు రహదారి పైకి వచ్చి బస్సు కోసం వేచి చూస్తున్నారు. ఈ క్రమంలో ఆమె వద్దకు బైక్‌పై హెల్మెట్ ధరించి వచ్చిన వారు.. 'దొంగలు వస్తున్నారు. బంగారం ఉంటే దాచుకోండి..' అని చెప్పి వెళ్లిపోయారు. ఆ తర్వాత మరో బైక్‌పై ఇద్దరు వచ్చి.. 'మేం పోలీసులం .. ఏం భయం లేదు. పుస్తెలతాడు, చెవి కమ్మలు తీసి మాకివ్వండి.' అని చెప్పారు. నమ్మిన పద్మ వారి చేతిలో ఆభరణాలు పెట్టింది. వారు 'ఏం భయం లేదమ్మా.. ఇదిగో నీ బంగారం బ్యాగులో పెడుతున్నాం'అంటూ కాగితంలో కట్టిన పొట్లం బ్యాగులో పెట్టి వెళ్లిపోయారు. ఆ తర్వాత పొట్లం విప్పి చూస్తే అందులో రాళ్లు కనిపించాయి. మోసపోయినట్లు గుర్తించి బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రెచ్చిపోతున్న దొంగలు..!

- రూటుమార్చిన కేటుగాళ్లు..
- మహిళలే లక్ష్యంగా దొంగతనాలు
- పోలీసుల పేరిట మోసాలు
- వరుస ఘటనలతో జనం బెంబేలు



కౌటాలలో చోరీ జరిగిన ఇంట్లో వివరాలు సేకరిస్తున్న పోలీసులు(ఫైల్)

కౌటాల(సిర్పూర్): ఇళ్లు, ఆలయాలు, దుకాణాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు.. ఇవీ సాధారణంగా దొంగల టార్గెట్లు. కానీ ఇప్పుడు వారు రూటు మార్చారు. ఇంటి బయట ఒంటరిగా ఉన్న మహిళలనే లక్ష్యంగా చేసుకుని ఆభరణాలు లాక్కొని వెళ్తున్నారు. వరుస దొంగతనాలు జిల్లావాసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా కష్టించి కూడబెట్టిన సొమ్మును కాజేస్తున్నారు. వేసవి ప్రారంభానికి ముందే దొంగలు చోరీలకు తెగబడుతుండం ఆందోళన కలిగిస్తోంది. వేసవి సెలవుల్లో ఇళ్లకు తాళాలు వేసి వెళ్తే మరింత రెచ్చిపోయే అవకాశం కన్పిస్తోంది. పట్టపగలే దోపిడీలకు పాల్పడుతుండటం కూడా కలకలం రేపుతోంది. దుండగులు పగలు కాలనీల్లో రెక్కీ నిర్వహిస్తూ తాళం వేసిన ఇళ్లను ఏ మాత్రం ఆలస్యం చేయకుండా దోచుకుంటున్నారు. దొంగలను పట్టుకుని సొమ్ము రికవరీ చేయడంలో పోలీసులు విఫలమవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

పోలీసుల అవతారం ఎత్తుతూ..

దొంగతనాల కోసం దుండగులు పోలీసుల అవతారం ఎత్తుతున్నారు. రహదారులపై వాహనాల కోసం ఎదురుచూస్తున్న వారి వద్దకు మాస్కులు, హెల్మెట్లు ధరించి వెళ్లి పోలీసులమని చెబుతూ నగదు, నగలు తీసుకుని బురిడీ కొట్టిస్తున్నారు. అమాయకులు నకిలీ పోలీసులను నమ్మి మోసపోతున్నారు. ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు పోలీసులమని చెప్పి ఆసిఫాబాద్ మండలం మానిక్‌గూడ వద్ద మహిళ నుంచి బంగారు ఆభరణాలు, సిర్పూర్(టి) మండల కేంద్రానికి చెందిన వ్యక్తి వద్ద నుంచి నగదు దోచుకున్నారు. అలాగే కొందరు వాహనాల తనిఖీల పేరిట అమాయకుల వద్ద అందిన కాడికి దోచుకుంటున్నారు. పార్కింగ్ చేసిన బైక్‌లను సైతం వదలడం లేదు. జిల్లాకు ఆనుకుని మహారాష్ట్ర ఉండడంతో దొంగలు పోలీసులకు చిక్కకుండా సరిహద్దు దాటుతున్నారు.

నిత్యం చోరీలు

జిల్లాలో నిత్యం ఎక్కడో ఓచోట చోరీలు జరుగుతూనే ఉన్నాయి. చాలా ఘటనలు వెలుగులోకి రావడం లేదు. ఏటా జిల్లాలో వందకు పైగా దొంగతనాలు నమోదవుతున్నాయి. ఇటీవల కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ పట్టణాల్లో చోరీలు పెరిగాయి. రెబ్బెన, వాంకిడి, చింతలమానెపల్లి, సిర్పూర్(టి), పెంచికల్‌పేట్, కౌటాల మండలాల్లో ఘటనలు తరుచూ చోటు చేసుకుంటున్నాయి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా చాకచాక్యంగా తప్పించుకుంటున్నారు.

చోరీల వివరాలు

సంవత్సరం	దొంగతనాలు
2023	104
2024	78

అప్రమత్తంగా ఉండాలి



ఇళ్లకు తాళాలు వేసి ఎక్కువ రోజులు శుభకార్యాలు, ఇతర పనులకు వెళ్తే దొంగలు పడే ప్రమాదం ఉంటుంది. అలాంటి సమయంలో అప్రమత్తంగా ఉంటూ స్థానికులు, పోలీసులకు సమాచారం అందించాలి. ఇంటి ఎదుట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌కుసమాచారం ఇవ్వడంతో పాటు డయల్ 100కు కాల్ చేయాలి.

– రామానుజం,
డీఎస్పీ, కాగజ్‌నగర్

జాగ్రత్తలు అవసరం

- వేసవి సెలవుల్లో ప్రజలు ఎక్కడైనా టూర్లు, ఇళ్లు వదిలి వెళ్లాల్సి వస్తే బంగారం, వెండి, ఆభరణాలు, డబ్బులు, బ్యాంక్ లాకర్లలో భద్రపరుచుకోవాలి. ఇంట్లోనే రహస్య ప్రదేశాల్లో దాచుకోవాలి.
- సెంట్రల్ లాక్ సిస్టమ్ గల తాళం పెట్టుకోవాలి. ఎక్కువ రోజు ఊరు వదిలి వెళ్లాల్సి వస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వడం ఉత్తమం.
- వాహనాలను ఇంటి ఆవరణలోనే పార్కు చేసుకుని, తప్పనిసరిగా తాళాలు వేయాలి. వీలైతే చక్రాలకు చైన్లతో లాక్ వేయాలి.
- గుర్తు తెలియని వారిని ఇంట్లో పనికి పెట్టుకోవద్దు.
- ఇంట్లో సీసీ కెమెరాలు నిత్యం ఆన్‌లైన్‌లో ఉండాలి. మెయిన్ డోర్‌కు తాళం వేసినా.. అది కనిపించకుండా కర్టెన్స్‌తో కవర్ చేయాలి.
- అల్మారా, కప్ బోర్డ్స్‌కు సంబంధించిన తాళాలు చెప్పుల స్టాండ్, పరుపులు, దిండ్ల కింద.. ఇలా తెలిసిన ప్రదేశాల్లో కా కుండా రహస్య ప్రదేశంలో ఉంచాలి.
- బంగారు ఆభరణాలు వేసుకుని ఫంక్షన్లు, గుడికి వెళ్తే జాగ్రత్తగా ఉండాలి.
- పోలీసులమని చెప్పినా ఎవరికీ నగదు, ఆభరణాలు తీసి ఇవ్వొద్దు. గుర్తు తెలియని వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

విశ్రాంత ఉద్యోగిని ఇంట్లో చోరీ

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ రోడ్‌లోని మాతృశ్రీ డిగ్రీ కళాశాల సమీపంలో నివాసం ఉంటున్న విశ్రాంత ఉద్యోగి కొలిపాక వరలక్ష్మి ఇంట్లో చోరీ జరిగింది. బాధితురాలి కథనం ప్రకారం.. కొలిపాక వరలక్ష్మి అత్యవసర పనిమీద మంగళవారం కెరమెరి మండలంలోని కుమార్తె ఇంటికి వెళ్లారు. బుధవారం ఉదయం వరలక్ష్మి కోడలు కవిత ఇంటిని గమనించగా.. కాంపౌండ్ గేట్లకు తాళాలు ఉండగా, ప్రధాన ద్వారం తలుపుల బెడెం మాత్రం పగలగొట్టి ఉంది. వెంటనే ఆమె వరలక్ష్మికి ఫోన్‌లో సమాచారం అందించింది. బాధితురాలు చేరుకుని గమనించగా ఇల్లు చిందరవందరగా పడి, బీరువాలో దాచిన రూ.70 వేల నగదు కనిపించలేదు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రవీందర్ ఘటనాస్థలికి చేరుకుని సిబ్బందితో కలిసి వివరాలు సేకరించారు. విశ్రాంత ఉద్యోగిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

20 నుంచి 'ఓపెన్' పరీక్షలు

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ఈ నెల 20 నుంచి ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి 26 వరకు ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కొనసాగుతాయన్నారు. పదో తరగతి పరీక్షలు ఆసిఫాబాద్ బాలికల ఉన్నత పాఠశాల, కాగజ్‌నగర్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో.. ఇంటర్ పరీక్షలు జన్కాపూర్ ఉన్నత పాఠశాల, కాగజ్‌నగర్‌లో బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు, డీఎంహెచ్‌వో సీతారాం, రవాణాశాఖ అధికారి రామచందర్, అధికారులు పాల్గొన్నారు.


ఈవీఎంలకు పటిష్ట భద్రత



గోదాం వద్ద కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని గోదాంలో ఈవీఎంల భద్రతకు కట్టుదిట్టమైన పటిష్ట చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ యంత్రాల గోదాం వద్ద సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. బందోబస్తు విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు సునీల్, నాయబ్ తహసీల్దార్ శ్యాంలాల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఈజీ మనీ.. ఆన్‌లైన్ ఆటలు!





- సులువుగా డబ్బు సంపాదనపై ఆశ
- బెట్టింగ్‌లు, గేమ్స్, యాప్‌లకు ఆకర్షణ
- రూ.లక్షలు కోల్పోతున్న బాధితులు
- మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో ఘటనలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఈజీ మనీ.. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో చాలామంది ఆర్థికంగా నష్టపోతున్నారు. ఆన్‌లైన్ వేదికగా సాగుతున్న కార్యకలాపాల్లో రూ.లక్షలు పోగొట్టుకుంటున్నారు. ఉద్యోగులు, వ్యాపారులు, యువత, విద్యార్థులు స్మార్ట్‌ఫోన్లలో అనేక రూపాల్లో పెట్టుబడులు పెడుతున్నారు. చాలామందికి ఇవి నష్టాలే తెస్తున్నా.. సోషల్ మీడియాలో వస్తున్న ప్రకటనలతో వేలాది మంది ఆకర్షితులు అవుతున్నారు. ఇలాంటి ప్రకటనలు, ఆన్‌లైన్ మోసాల బారిన పడొద్దని పోలీసులు సూచిస్తున్నారు.

బెట్టింగ్ యాప్‌లు

బెట్టింగ్ మోజులో పడి చాలామంది యువత తమ భవిష్యత్‌ను పాడు చేసుకుంటున్నారు. మంచిర్యాలతోపాటు కాగజ్‌నగర్, బెల్లంపల్లి, ఆసిఫాబాద్ వంటి గిరిజన ప్రాంతాల్లోనూ అనేకమంది ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ల్లో బెట్టింగ్ పెడుతున్నారు. కాగజ్‌నగర్‌లో కొందరు సట్టా, మట్కా ఆడిస్తూ డబ్బులు అధికంగా సంపాదించవచ్చని చెబుతూ ఊబిలోకి దింపుతున్నారు. మహారాష్ట్రలో కళ్యాణ్, ముంబయితోపాటు నగరాల కేంద్రంగా నడిచే సట్టా, మట్కాలో సింగిల్, డబుల్.. అంటూ రూ.10కి వంద, వెయ్యి, పది వేలు దాక లాభం ఉంటుందని ప్రచారం చేస్తున్నారు. పలానా నంబర్ వస్తే మీకు లక్ కలిసి వస్తుందని చెబుతూ రూ.లక్షలు వసూళ్లు చేస్తున్నారు. ఇటీవల కాగజ్‌నగర్‌కు చెందిన నలుగురు యువకులు మట్కా కేసులో హైదరాబాద్‌లో పట్టుబడ్డారు.

ఆన్‌లైన్ యాప్స్, గేమ్స్

ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడితే డబ్బులు వస్తాయంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంతోనూ అనేక మంది స్మార్ట్‌ఫోన్లలో ఆడుతున్నారు. రమ్మీతోపాటు పలు గేమ్స్ డబ్బులు పెట్టి ఆడుతున్నారు. విద్యార్థులతోపాటు ఉద్యోగస్తులు ఆర్థికంగా నష్టపోతున్నారు. పలు యాప్‌లతోనూ ఆన్‌లైన్‌లోనే లావాదేవీలు జరుపుతున్నారు. మందమర్రికి చెందిన ఓ పేకాట వ్యసనపరుడు ఆన్‌లైన్‌లో రమ్మీ ఆడుతూ రూ.లక్షలు పోగొట్టుకున్నాడు. మంచిర్యాల కేంద్రంగా ఓ యాప్ పేరుతో సభ్యులను చేర్పిస్తూ డబ్బులు వసూలు చేశారు. రిజిస్ట్రేషన్లు చేసి, వందలాది మందితో ఆ యాప్ డౌన్‌లోడ్ చేయించారు. డబ్బులు జమ చేశాక కొందరికి మాత్రమే లాభాలు వచ్చి మిగతా వారు మోసపోయామని బాధపడ్డారు.

బయటకు చెప్పుకోలేక..

ఆన్‌లైన్ మోసాల బాధితులు చాలామంది బయటకు చెప్పుకోలేకపోతున్నారు. సైబర్ నేరాల్లో మాత్రమే కేసులు నమోదవుతున్నాయి. తెలిసి పెట్టుబడి పెట్టి కోల్పోయిన ఘటనల్లో బయటకు రావడం లేదు. ఇటీవల ఆర్కేపీకి చెందిన ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెట్టి ప్రకటనలో చూపించినట్లుగా రాలేదని నిర్వాహకులను అడిగితే అక్కడి నుంచి సమాధానం రాలేదు. ఉద్యోగిగా సమాజంలో ఇబ్బందిగా మారుతుందని ఆయన ఎక్కడా ఫిర్యాదు కూడా ఇవ్వలేదు.

చైన్‌మార్కెటింగ్‌తోనూ

ఇంట్లోనే ఉంటూ డబ్బులు సంపాదించవచ్చు, తమ ఉత్పత్తులను ప్రచారం చేసి పైసలు కూడబెట్టవచ్చంటూ చేసే ప్రచారంతో నష్టపోతున్నారు. చైన్, ఆన్‌లైన్ మార్కెటింగ్ తదితర వాటితోనూ దెబ్బతింటున్నారు. ఒకరిని చేర్పించి, మరొకరిని చేర్పిస్తే డబ్బులు వస్తాయంటూ ఆశ చూపుతున్నారు. మొదట కొందరికి డబ్బులు వచ్చేలా చేసి ఆ తర్వాత చేతులెత్తేస్తున్నారు. అప్పట్లో మంచిర్యాలలో ఓ వ్యాపారి వందలాది మందిని చైన్ మార్కెటింగ్‌లో వాట్సాప్ గ్రూపుగా ఏర్పాటు చేసి రూ.లక్షల్లో కట్టాక ఆ డబ్బులు సైతం రాకపోయేసరికి అందరూ కలిసి ఆయనపై కేసు పెట్టారు. ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో ఈ బాధితులు ఎక్కువగా ఉన్నారు. ఇటీవల కాగజ్‌నగర్‌లో మహిళలకే రుణాలు అంటూ ప్రచారం చేసి డబ్బులు వసూలు చేసి పరారయ్యారు.

తులం బంగారం హామీ అమలు చేయాలి

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి



లబ్ధిదారులతో ఎమ్మెల్యే కోవ లక్ష్మి

వాంకిడి(ఆసిఫాబాద్): కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణ లక్ష్మి పథకం నగదు అందించడంతోపాటు తులం బంగారం హామీ అమలు చేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. వాంకిడి మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు 91 చెక్కులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రియాజ్ అలీ, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్/రెబ్బెన: గోలేటి ఓపెన్‌కాస్ట్‌లో భూములు కోల్పోతున్న బాధితులకు న్యాయం చేయాలని కాంగ్రెస్, బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ముంపునకు గురవుతున్న భూములకు ఎకరాకు రూ.25 లక్షలు చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి పర్మినెంట్ ఉద్యోగం ఇవ్వాలని బుధవారం ఎమ్మెల్సీ దండె విఠల్, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాదరావు, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులు గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కృష్ణకుమారి, అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, మండల ప్రధాన కార్యదర్శి నవీన్‌గౌడ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఉపేందర్ జిల్లా కేంద్రంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం అందించారు. రైతుల మధ్య గొడవలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. సింగరేణి యాజమాన్యం బ్రోకర్ల ద్వారా నోటీసులు అందించి, బలవంతంగా సంతకాలు పెట్టిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు సిడాం ధర్మ పటేల్, జిట్టవేణి మహేశ్, రాములు పాల్గొన్నారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

కాగజ్‌నగర్‌రూరల్: నకిలీ పత్తి విత్తనాలు సరఫరా అవుతున్నాయనే పక్కా సమాచారం మేరకు బుధవారం పట్టణంలోని పలు ట్రాన్స్‌పోర్ట్‌ల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీ చేపట్టారు. ఓ ట్రాన్స్‌పోర్ట్‌లో విజయవాడ నుంచి బెజ్జూర్ మండలం కుశ్నపల్లి గ్రామానికి చెందిన కె.చంద్రశేఖర్ పేరు మీద వచ్చిన 45 కిలోల నకిలీ పత్తి విత్తనాల సంచిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న నకిలీ విత్తనాలను పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించామని, వాటి విలువ సుమారు రూ.1,57,500 ఉంటుందని టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. అమాయక రైతులను మోసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్, సిబ్బంది మధు, రమేశ్ పాల్గొన్నారు.

గ్యాస్ ధరలు తగ్గించాలని నిరసన

ఆసిఫాబాద్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద ఖాళీ సిలిండర్లతో నిరసన తెలిపారు. ఆ పార్టీ కార్యదర్శి వర్గ సభ్యుడు కోట శ్రీనివాస్ మాట్లాడుతూ గ్యాస్ ధరలు సామాన్య, మధ్య తరగతి ప్రజలకు భారంగా మారాయన్నారు. రాష్ట్రంపై రూ.400 కోట్ల భారం పడుతుందన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గుతుండగా, దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు గొడిసెల కార్తీక్, కొరెంగ మాలశ్రీ, టీకానంద్, శ్రావణి పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో గాయ పడిన యువకుడు మృతి

భీమారం: ఈనెల 6న రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు బుధవారం మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు భీమారం గ్రామానికి చెందిన గొల్లపల్లి మహేశ్ (27) ఈనెల 6న చెన్నూర్ మండలంలోని సుద్దాలలో జరిగిన శ్రీరామనవమి వేడుకలకు హాజరయ్యాడు. తిరుగు ప్రయాణంలో బైక్‌పై స్వగ్రామానికి వస్తుండగా కిష్టంపేట సమీపంలోని జాతీయ రహదారిపై లారీ ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. ముందుగా మంచిర్యాల ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యంకోసం వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించి చికిత్స అందించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు.

చికిత్స పొందుతూ ఒకరు..



నగేష్ (ఫైల్)

వేమనపల్లి: గత నెల 20న మద్యం మత్తులో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గొర్లపల్లి కొత్త కాలనీకి చెందిన నికాడి నగేష్ (25) విద్యుత్ శాఖలో కాంట్రాక్ట్ హెల్పర్(ఎస్ఎంఆర్)గా పనిచేస్తున్నాడు. తనకు ఎవరూ పిల్లను ఇవ్వడం లేదని తరచూ బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో గత నెల 20న గ్రామ సమీపంలో ఉన్న మామిడి తోటకు వెళ్లి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చెన్నూర్, మంచిర్యాల, కరీంనగర్, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుని సోదరుడు సాయికిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్యాం పటేల్ తెలిపారు. మృతుని తండ్రి విజయ్‌కుమార్ సైతం 11 నెలల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటి పెద్ద కుమారుడు మృతి చెందడంతో తల్లి అమృత విలపించిన తీరు అందరిని కంటతడి పెట్టించింది.

రైలు కిందపడి యువకుడు బలవన్మరణం



శివశంకర్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: రైలు కిందపడి యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. జీఆర్పీ ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల మేరకు జిల్లా కేంద్రంలోని హమాలీవాడకు చెందిన నాగవెల్లి శివశంకర్ (35)కొంతకాలంగా ఏపనీ చేయకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. దీంతో దంపతుల మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. మంగళవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన శివశంకర్ బుధవారం తెల్లవారు జామున స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని ఏ క్యాబిన్ వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య జయశ్రీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

గంజాయి సేవిస్తున్న ఇద్దరిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: గంజాయి సేవిస్తున్న ఇద్దరిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. పోలీసులు ఏరోడ్రామ్‌లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇద్దరు యువకులు సిగరెట్ తాగుతూ కనిపించారు. అనుమానం వచ్చి గంజాయి టెస్ట్ నిర్వహించగా పాజిటివ్ వచ్చినట్లు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్‌కు చెందిన రహిమాన్ ఖాన్, మసూద్‌నగర్‌కు చెందిన అస్మరుల్లాపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

సింగరేణిలో ఆర్కే 6 గనికి ప్రత్యేక స్థానం



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్: సింగరేణిలో ఆర్కే 6 గనికి ప్రత్యేక స్థానం ఉందని శ్రీరాంపూర్ జీఎం ఎం. శ్రీనివాస్ అన్నారు. ఈ గని ఏర్పాటు చేసి 60 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం గనిపై వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జీఎం మాట్లాడుతూ వేలాది మంది కార్మికులు ఇక్కడ పనిచేసి బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనలో భాగస్వామ్యం అయ్యారన్నారు. ఎస్‌డీఎల్ సెక్షన్‌లో అత్యధిక ఉత్పత్తిని సాధించి కంపెనీలోనే రికార్డు నమోదు చేసుకుందన్నారు. బొగ్గు నిల్వలు అడుగంటడంతో మరో రెండు నెలల్లో గనిని మూసివేస్తున్నామన్నారు. ఏరియా ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, గ్రూప్ ఏజెంట్ శ్రీధర్, గని మేనేజర్ ఈ.తిరుపతి, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి కే.వీరభద్రయ్య, బ్రాంచి సెక్రెటరీ ఎస్కే బాజీసైదా, గని రక్షణాధికారి కాదాసి శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

బస్టాండ్ విస్తరణ



మంచిర్యాల బస్‌స్టేషన్‌లో నిలిపిన బస్సులు

- అధికారుల కసరత్తు
- పనులకు ఏర్పాట్లు

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రమైన మంచిర్యాల ఆర్టీసీ బస్టాండ్ విస్తరణపై యాజమాన్యం దృష్టి సారించింది. ప్రయాణికుల రద్దీ, బస్సుల రాకపోకలకు ఇబ్బందిగా మారిన బస్ డిపో తరలించాలనే ప్రతిపాదన కాగితాలకే పరిమితమైంది. దీంతో ప్రస్తుతం డిపోకు ఉన్న కొద్దిపాటి స్థలాన్ని సద్వినియోగం చేసుకునేలా కసరత్తు జరుగుతోంది. ఏళ్ల క్రితం నిర్మించిన బస్‌స్టేషన్‌లో అసౌకర్యాలు తిష్టవేశాయి. ఒక్కోసారి కూర్చోవడం మాటేలా ఉన్నా నిల్చోవడానికి కూడా స్థలం దొరకని పరిస్థితి ఎదురవుతోంది. అస్తవ్యస్తంగా చేపట్టిన నిర్మాణాలు, స్థలం కొరతతో బస్సులు నిలిపేందుకు పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. ఏ బస్సు కదులుతుందో తెలియక ప్రమాదాలు జరుగుతున్న సంఘటనలు లేకపోలేదు. ఈ నేపథ్యంలో బస్టాండ్ విస్తరించాలనే అధికారుల ఆలోచనకు అడుగులు పడుతున్నాయి. మంచిర్యాల డిపో స్థలం(ప్రహరీని కొంతమేరకు పక్కకు జరిపి)లోకి బస్‌స్టేషన్ విస్తరించేందుకు అధికారులు పంపించిన ప్రతిపాదనలకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఈ నెలాఖరులోపు విస్తరణ పనులు సాగేలా ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి.

మెరుగుపడని సౌకర్యాలు..

ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడే మంచిర్యాల డిపోను తొమ్మిది ప్లాట్‌ఫారాలు, 32 బస్సులతో 1975 ఫిబ్రవరి 6న ఏర్పాటు చేశారు. 3.21 ఎకరాల్లో డిపో, 1.34ఎకరాల్లో బస్టాండ్ నిర్మించారు. అప్పటి రవాణా శాఖ మంత్రి చొక్కారావు ప్రారంభించారు. 1985నాటికి బస్సుల సంఖ్యను 118కి పెంచారు. ప్రయాణికుల సంఖ్య, బస్సులు పెరిగినా బస్టాండ్‌లో సౌకర్యాలు మెరుగుపడలేదు. ప్రస్తుతం డిపో పరిధిలో 146బస్సులు ఉండగా.. ఇందులో 69 అద్దె బస్సులు ఉన్నాయి. బస్టాండ్ మీదుగా రోజుకు 62 వేల కిలోమీటర్ల మేర బస్సులు నడపడం ద్వారా రూ.34లక్షల నుంచి రూ.36లక్షలు(మహాలక్ష్మి పథకం కలిపి) ఆదాయం సమకూరుతోంది. ఆదాయం వస్తున్నా సమస్యలే అలాగే ఉన్నాయి.

ఆదాయంపై దృష్టి

బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యాల కంటే అధికారులు వాణిజ్య సముదాయాలపైనే దృష్టి సారించారు. ఏళ్ల తరబడి బస్టాండ్ విస్తరించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 1985లో బస్టాండ్‌లో తొమ్మిది ప్లాట్‌ఫారాలు, 14 స్టాళ్లు ఏర్పాటు చేసిన అధికారులు ప్లాట్‌ఫారాల సంఖ్యపై దృష్టి సారించకుండా 14నుంచి 29వరకు స్టాళ్లు పెంచారు. దీంతో చుట్టూ దుకాణాల నిర్మాణం జరిగి బస్టాండ్ ఇరుకుగా మారింది.

ఇరుకుగా మారి..

బస్టాండ్ ఇరుకుగా ఉండడం.. ఏళ్ల తరబడి ప్లాట్‌ఫారమ్‌లు పెంచకపోవడంతో బస్సులు నిలిపేందుకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. మంచిర్యాల డిపోతోపాటు ఇతర ప్రాంతాల నుంచి బస్సులు రోడ్లపైనే గంటల తరబడి నిలపాల్సి రావడంతో రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు తరచూ ఇబ్బంది పడాల్సి వస్తోంది. బస్సు వెనుకాల బస్సులు రావడం.. వెనక్కి చూసుకోకుండా బస్సులు ప్లాట్‌ఫారమ్ నుంచి తీయడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతూ ప్రాణాలు పోతున్న సందర్భాలు ఉన్నాయి.

దుకాణాల నిర్వహణదారులు కేటాయించిన స్థలం కంటే ముందుకు వచ్చి వస్తువులు పెట్టడంతో స్థలం దొరక్క ప్లాట్‌ఫారాలు, బస్‌లు నిలిపే స్థలంలో బస్సుల కోసం వేచి చూడాల్సిన దుస్థితి. అద్దెకు తీసుకున్న హోటల్ యజమాని అడ్డుగా ఉన్న చల్లని తాగునీరు ఫ్రిడ్జ్‌ను ఏకంగా అక్కడి నుంచి తొలగించడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. బస్టాండ్ ముఖద్వారం(రైల్వేస్టేషన్ రోడ్ వైపు) కూడా ఆర్టీసీ అద్దె దుకాణాల కోసం నిర్మాణాలు చేపడం సమస్యగా మారింది.

మరుగుదొడ్ల నిర్మాణం..

బస్టాండ్ నిర్మాణ సమయంలో ఒకే మరుగుదొడ్డి, మూత్రశాలలు నిర్మించారు. నిర్వహణ సరిగా లేక దుర్వాసన వెదజల్లుతున్నాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు మంచిర్యాల మున్సిపాల్టీ మొదటి ద్వారా వద్ద ప్రయాణికులు రాకపోకలు సాగించే వైపు షీ టాయిలెట్స్, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. మరుగుదొడ్లకు తాళం తెరిచి లేక నిరుపయోగంగా మారాయి. అధికారుల అనాలోచిత నిర్ణయాలతో నిర్మించిన మరుగుదొడ్లు, దుకాణాల వల్ల బస్సులు నిలుపడానికి స్థలం, ప్లాట్‌ఫారాలు లేక రోడ్లపై నిలపాల్సిన పరిస్థితి నెలకొంది.

ఉపశమనం దిశగా..

ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న బస్టాండ్ విస్తరణకు మోక్షం లభించింది. బస్‌డిపో ప్రహరీని 12నుంచి 13అడుగుల మేర వెనక్కి జరిపేందుకు నిర్ణయించారు. ప్రస్తుతం డిపోలో ఉన్న స్కూటర్ షెడ్‌ను డిపో వెనుక వైపు ఏర్పాటు చేయనున్నారు. నిర్మల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన మరుగుదొడ్డి, సెక్యూరిటీ రూంలు యధావిధిగా ఉంచాలనే ఆలోచనకు వచ్చినట్లు తెలుస్తోంది. మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన.. నిరుపయోగంగా మారిన మరుగుదొడ్లను తొలగించాల్సిన అవసరం ఉంది. వాహనాల స్టాండ్‌ను అక్కడి నుంచి తొలగించి ఆసుపత్రి వెనుక వైపు ఖాళీ స్థలానికి మార్చడం వల్ల బస్సుల రాకపోకలకు ఇబ్బందులు తొలగే అవకాశాలున్నాయి. ప్రస్తుతం డిపో ప్రహరీని కొద్దిమేర తొలగించడం వల్ల స్థలం కొరత తీరనుంది. బస్టాండ్ విస్తరణ బడ్జెట్ మంజూరు కాగా త్వరలోనే పనులు ప్రారంభం కానున్నట్లు ఓ అధికారి తెలిపారు.

నాగోబాకు జలాభిషేకం



పవిత్ర జలంతో బయలుదేరిన యువతులు

ఇంద్రవెల్లి: చైత్రమాసాన్ని పురస్కరించుకుని బుధవారం మండలంలోని కేస్లాపూర్ నాగోబా దేవతకు జలాభిషేకం చేశారు. కేస్లాపూర్ గ్రామానికి చెందిన ఏడుగురు యువతులు పవిత్రమైన కోనేరు నీటిని తీసుకెళ్లి నాగోబాకు జలాభిషేకం చేశారు. చైత్రమాసంలో నిర్వహించే గావ్‌సాత్ (పోచ్చమ్మ) తల్లిపూజలకు ముందు ఐదురోజుల పాటు జలాభిషేకం చేయడం ఆనవాయితీగా వస్తోందని గ్రామ పటేల్ మెస్రం వెంకట్‌రావ్ తెలిపారు. ఈ నెల 13 వరకు అభిషేకం చేసిన అనంతరం గ్రామంలో గావ్‌సాత్(పోచ్చమ్మ) పూజలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

ఆర్జీయూకేటీకి ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ సెంటర్

- రూ.15 లక్షల చెక్కు అందించిన గవర్నర్ జిష్ణుదేవ్



వీసీకి చెక్కు అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్

బాసర: బాసర ఆర్జీయూకేటీలో ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు గవర్నర్ జిష్ణుదేవ్ బుధవారం ఆర్జీయూకేటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ఏ.గోవర్ధన్‌కు రాజ్‌భవన్‌లో రూ.15 లక్షల చెక్కును అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రగతి అవకాశాలను వినియోగించుకునేలా వినూత్న పారిశ్రామిక ఆలోచనల ఏర్పాటే లక్ష్యంగా ఈ సెంటర్ పని చేయనుంది. తదనుగుణంగా గవర్నర్ జిష్ణుదేవ్ ఆర్జీయూకేటీలో ఇటీవల జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, తీసుకుంటున్న చర్యలు, విద్యార్థుల సంక్షేమ కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళిక, వివిధ సంస్కరణలను ప్రశంసించారు. ఈ సందర్భంగా వీసీ గోవర్ధన్ గవర్నర్ జిష్ణుదేవ్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



నడిపి మల్లన్న (ఫైల్)

లోకేశ్వరం: పంటలను కాపాడుకునేందుకు బోర్లు వేసినా నీరు పడక, అప్పులు తీర్చే దారిలేక రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని రాజూర గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పతాని నడిపి మల్లన్నకు ఎనిమిది ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. గత పదేళ్లుగా పంటలు సాగు చేసేందుకు అప్పు చేసి 30 బోర్లు వేయించాడు. బోర్లలో చుక్క నీరు రాలేదు. ఈసారి యాసంగిలో రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాడు. పంటకు నీరందక కళ్ల ముందే ఎండిపోయే దశకు చేరింది. పంటను కాపాడుకునేందుకు ఈ యాసంగిలోనే రెండు బోర్లు తవ్వించినా ఫలితం లేకపోయింది. బ్యాంకు, ప్రైవేటు అప్పులు రూ.8లక్షల వరకు ఉన్నట్లు తెలిసింది. అప్పులు తీర్చాలో తెలియక నడిపి మల్లన్న(56) చేనులోనే చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడికి భార్య నర్సవ్వ, కుమారుడు మహేష్, కూతురు మానస ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండలంలోని పెన్‌గంగ నుంచి ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు జైనథ్ సీఐ సాయినాథ్ తెలిపారు. భోరజ్ వద్ద జైనథ్ ఎస్సై పురుషోత్తం, సిబ్బంది రాఘవేంద్ర, శివాజీ, రజినీకాంత్ తనిఖీ నిర్వహిస్తుండగా ట్రాక్టర్లలో ఉన్న ఇసుకపై ఎలాంటి కవర్ కప్పకుండా తీసుకెళ్తుండగా పట్టుకుని సీజ్ చేసినట్లు తెలిపారు.

వాల్వో డ్రైవర్ల పోరుబాట

- వేతనాలు పెంచాలని 12 రోజులుగా సమ్మె
- ఐకే ఓసీపీలో నిలిచిన బొగ్గు ఉత్పత్తి



సమ్మె చేస్తున్న వాల్వో డ్రైవర్లు

జైపూర్: వేతనాలు పెంచాలని ఐకే ఓసీపీలో పనిచేస్తున్న వాల్వో డ్రైవర్లు గత నెల 29 నుంచి పోరుబాట పట్టారు. ఇతర ఏరియాల్లో మాదిరి తమకూ అమలు చేయాలని సమ్మెకు దిగారు. 12 రోజులుగా కార్మికులు సమ్మెకు దిగడంతో ఐకే ఓసీపీలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది.

జైపూర్ మండలంలోని ఇందారం ఐకేఓసీపీలో ఓబీ మట్టి తవ్వకం, బొగ్గు ఉత్పత్తి పనులను వరాహ కంపెనీ చేపడుతోంది. కంపెనీలో వాల్వో డ్రైవర్లు, మెకానిక్‌లు, హెల్పర్లు, సూపర్‌వైజర్లు, కార్యాలయ సిబ్బంది సుమారు 500కు పైగా పనిచేస్తున్నారు. డ్రైవర్లకు రూ.19,040, మెకానిక్‌లు, హెల్పర్లకు రూ.12వేల నుంచి 18వేల వరకు, సూపర్‌వైజర్లు, సిబ్బందికి రూ.20 వేలకు పైగా చెల్లిస్తున్నారు. వేతనాలు పెంచాలని మూడేళ్లుగా కోరుతున్నా వరాహ కంపెనీ, సింగరేణి యాజమాన్యం పట్టించుకోకపోవడంతో వాల్వో డ్రైవర్లు, మెకానిక్‌లు, హెల్పర్లు సుమారు 400 మంది సమ్మెలోకి దిగారు. ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనాలకు అదనంగా రూ.5వేలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.

బొగ్గు ఉత్పత్తికి ఆటంకం...

గతంలో ఐకే ఓసీపీ నిర్దేశిత గడువుకు ముందుగానే రికార్డు స్థాయిలో వందశాతంకు పైగా బొగ్గు ఉత్పత్తి సాధించింది. ప్రస్తుతం ఓబీ మట్టి తవ్వకాలు చేపడుతున్న వరాహ కంపెనీ నిర్వహణ సంక్రమంగా చేపట్టకపోవడం, కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వకపోవడం, వాల్వో వాహనాలు, డోజర్లు సరిపడా లేకపోవడం బొగ్గు ఉత్పత్తికి తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది.

వేతనాలు పెంచాలి



గోదావరిఖని ఏరియాలో చెల్లిస్తున్న విధంగా ఇక్కడి కార్మికులకు సైతం వేతనాలు పెంచాలి. మూడేళ్లుగా వేతనాలు పెంచలేదు. సింగరేణి అధికారులు చొరవ చూపి వేతనాల పెంపునకు కృషి చేయాలి.– టి.కిష్టయ్య, కాంట్రాక్టు కార్మికుడు

ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం..!



తహసీల్దార్ కార్యాలయం ముందు హాల్

- సర్కారు భూమిలో 'రియల్' వ్యాపారం
- అక్రమంగా నిర్మాణాలు

మందమర్రిరూరల్: మండలంలోని పలుచోట్ల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతోంది. అయినా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకుని ప్రభుత్వ భూమి పక్కనే ఉన్న భూమిని కొనుగోలు చేస్తున్నారు. ఆ తర్వాత ప్రభుత్వ భూమిని కలిపి అక్రమంగా వెంచర్లు చేస్తున్నారు. రిటైర్డు ఉద్యోగులు, వ్యాపారులు ఆ ప్లాట్లను కొనుగోలు చేసిన తర్వాత తెలిసి మోసపోయామని ఆందోళన చెందుతున్నారు. పాలచెట్టు ఏరియా సమీపంలోని డబుల్ బెడ్రూం ఇళ్ల సమీపంలో ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణాలు వెలిసాయి. పదేళ్ల క్రితం సింగరేణి ప్రభుత్వానికి అప్పగించిన భూమిలో ఇష్టారీతిగా నిర్మాణాలు జరిగాయి.

అమ్మేశారు..

మున్సిపాల్టీలో 1/70 గిరిజన చట్టం అమలులో ఉన్నా పలువురు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ భూమిని అమ్మేసి లక్షల్లో సంపాదించారనే ఆరోపణలు ఉన్నాయి. జాతీయ రహదారి సమీపంలో అందుగులపేట వద్ద 364 సర్వేనంబర్‌లో ఓ వ్యాపారి వెంచర్ చేసి విక్రయించగా మందమర్రి పట్టణానికి చెందిన వ్యాపారి కొనుగోలు చేసి ఫాం హౌజ్ నిర్మించుకున్నాడని బీఎస్పీ చెన్నూర్ నియోజవవర్గ అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ ఇటీవల జిల్లా అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మండలంలోని ఆదిల్‌పేట్ గ్రామ పంచాయతీ పరిధి ఎర్ర చెరువు అభివృద్ధి కోసం పదేళ్ల క్రితం ప్రభుత్వం కొనుగోలు చేసిన సుమారు 30 ఎకరాల భూమిని ఇంతవరకు అధికారులు గుర్తించలేదు. రికార్డులు అందుబాటులో లేవని పేర్కొనడం గమనార్హం.

అక్రమ నిర్మాణాలు స్వాధీనం



పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న ప్రభుత్వ భూమి

మందమర్రి మున్సిపాలిటీ పరిధి 148 సర్వే నంబరులోని ప్రభుత్వ భూమిలో పదేళ్ల క్రితం ఓ మాజీ ప్రజాప్రతినిధి నిర్మాణాలు చేపట్టారు. అక్రమ నిర్మాణాలని తేలడంతో ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఆ నిర్మాణానికి సంబంధించిన డబ్బు చెల్లించినట్లు సమాచారం. ప్రస్తుతం ఆ స్థలం, నిర్మాణం ప్రభుత్వ ఆధీనంలో ఉంది. ప్రభుత్వ అవసరాల కోసం వినియోగించాలని పలువురు సూచిస్తున్నారు.

నిరుపయోగంగా కమ్యూనిటీ హాల్

మందమర్రి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట 148 సర్వే నంబరులో సుమారు 20 గుంటలు కబ్జా చేసి కమ్యూనిటీ హాల్ నిర్మించారు. అక్రమ నిర్మాణంపై అప్పట్లో 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితం కావడంతో అప్పటి కలెక్టర్ కర్ణన్ పర్యవేక్షణలో విచారణ జరిపి ప్రభుత్వానికి స్వాధీనం చేశారు. నిర్మాణానికి సంబంధించిన డబ్బు కూడా చెల్లించినట్లు సమాచారం. ప్రస్తుతం హాల్ నిరుపయోగంగా ఉంది. రైతులకు గోదాము, ప్రజల సౌకర్యార్థం ఫంక్షన్ హాల్, ప్రభుత్వ కార్యాలయాల సమావేశ మందిరంగా గానీ వినియోగించాలని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కబ్జా చేస్తే ఊరుకునేది లేదు



మండలంలోని ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే ఊరుకునేది లేదు. 148 సర్వే నంబర్‌లో అక్రమ నిర్మాణాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. 364 సర్వేనంబర్‌లో ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఫాం హౌజ్ వేసారని తెలిసింది. సర్వే చేయించి ఉన్నతాధికారులకు తెలియజేసి చర్యలు తీసుకుంటాం. సర్వేనంబర్ 195 రామకృష్ణాపూర్ రోడ్డు వెళ్లే మార్గంలోని ఎమ్మెల్యే కాలనీలో సుమారు 16 గుంటలు ప్రభుత్వ భూమిని గుర్తించి బోర్డు ఏర్పాటు చేశాం. – సతీశ్‌కుమార్, తహసీల్దార్

విహారయాత్రలో విషాదం

- ఛత్తీస్‌గఢ్‌లో నీటమునిగి నస్పూర్ వాసి మృతి



పృథ్వీరాజ్ (ఫైల్)

నస్పూర్: పట్టణ పరిధిలోని షిర్కేకాలనీకి చెందిన దొరిసెట్టి పృథ్వీరాజ్ (32) మంగళవారం ప్రమాదవశాత్తు ఛత్తీస్‌గఢ్‌లోని అమృతధార జలపాతంలో నీటమునిగి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు షిర్కే కాలనీకి చెందిన దొరిసెట్టి తిరుపతి కుమారుడు పృథ్వీరాజ్ ఛత్తీస్‌గఢ్‌లోని (ఎస్ఈసీఎల్) కోలిండియాలో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం విధులు ముగించుకుని తోటి ఉద్యోగులతో కలిసి సమీపంలోని అమృతధార జలపాతాన్ని వీక్షించడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు జలపాతంలో నీటమునిగి అతనితో పాటు మరో ఉద్యోగి మృతి చెందాడు. మృతునికి భార్య నిహారిక, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని బుధవారం నస్పూర్‌కు తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేశారు.

కార్మికుల రక్షణకు ప్రాధాన్యత



సమావేశంలో అధికారులు, యూనియన్ ప్రతినిధులు

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని డిప్యూటీ ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ గంగాధర్‌రెడ్డి అన్నారు. ఎస్టీపీపీలో బుధవారం బీఎంఎస్, హెచ్ఎంఎస్, ఐఎన్టీయూసీ యూనియన్ల ప్రతినిధులు, సింగరేణి, పవర్‌మేక్ అధికారుల నేతృత్వంలో రక్షణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ల ప్రతినిధులు పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. భద్రతపై అన్నిస్థాయిల కార్మికులకు శిక్షణ ఇవ్వాలని, కార్మికుల పనికి అనుగుణంగా రక్షణ పరికరాలు సరఫరా చేయాలన్నారు. కార్మికుల ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించే వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. ప్లాంటులో ఇప్పటి వరకు జరిగిన ప్రమాదాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ జీఎం శ్రీనివాసులు, ఓఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్, ఐఎన్టీయూసీ పిట్ సెక్రెటరీ సత్యనారాయణ, బీఎంఎస్ జనరల్ సెక్రెటరీ దుస్స భాస్కర్, హెచ్ఎంఎస్ జనరల్ సెక్రెటరీ విక్రమ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రదీప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళను కాపాడిన కానిస్టేబుల్



మహిళతో కానిస్టేబుల్

బాసర: బాసర గోదావరినదిలో దూకేందుకు యత్నించిన మహిళను కానిస్టేబుల్ మోహన్‌సింగ్ అడ్డుకుని ప్రాణాలు రక్షించాడు. వివరాలు ఇలా ఉన్నాయి. భైంసా పట్టణంలోని గుంటగల్లికి చెందిన మహిళ బుధవారం కుటుంబ సమస్యలతో నదిలో దూకేందుకు ప్రయత్నించడంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ మోహన్ సింగ్ అడ్డుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. అనంతరం మహిళను పోలీస్ స్టేషన్‌కు తరలించి ఎస్సై గణేశ్ కౌన్సిలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ప్రమాదాలు పునరావృతం కావొద్దు



మాట్లాడుతున్న డీఎంఎస్ నాగేశ్వర్‌రావు

శ్రీరాంపూర్: సింగరేణిలో ప్రమాదాలు పునరావృతం కాకుండా చూసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (డీఎంఎస్) ఎన్.నాగేశ్వర్‌రావు సూచించారు. బుధవారం సీసీసీలోని సింగరేణి గెస్ట్‌హౌజ్ కాన్ఫరెన్స్ హాల్‌లో బెల్లంపల్లి రీజియన్‌లోని భూగర్భ గనుల్లో రూఫ్ ప్రమాదాలు, రక్షణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన ప్రమాదాలపై విచారణ జరిపి మరో సారి అలా జరుగకుండా చూడాలన్నారు. రూఫ్ ప్రమాదాల నివారణకు కొత్త టెక్నాలజీని వాడుకోవాలన్నారు. ఇన్‌డ్యూస్ బ్లాస్టింగ్‌లో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీఎంఆర్ 2017 కోల్‌మైన్స్ రూల్స్‌ను పాటిస్తూ సపోర్టింగ్ చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ ప్రేంకుమార్, కార్పొరేట్ సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం కే.రఘు కుమార్, శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్, మందమర్రి జీఎం దేవేందర్, బెల్లంపల్లి జీఎం విజయ భాస్కర్ రెడ్డి, ఏరియా సేఫ్టీ అధికారులు శ్రీధర్‌రావు, రాయమల్లు, ఏజెంట్లు రాజేందర్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రియుడితో కలిసి భర్తపై హత్యాయత్నం



గాయపడిన సాహెబ్‌రావ్

ఇంద్రవెల్లి: ప్రియుడితో కలిసి భర్తపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని హీరాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గోపాల్‌పూర్‌లో చోటు చేసుకుంది. గ్రామస్తులు, ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపిన వివరాల మేరకు గోపాల్‌పూర్‌కు చెందిన లాండ్గే సాహెబ్‌రావ్‌కు నిర్మల్ జిల్లా పెంబి మండలంలోని దోందరి గ్రామానికి చెందిన ఎల్లవ్వతో రెండేళ్ల క్రితం వివాహమైంది. దంపతులకు కుమార్తె సంతానం. వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వరుసకు చిన్నమ్మ కుమారుడైన సట్ల దశరథ్ ఏడాది నుంచి సాహెబ్‌రావ్ ఇంట్లోనే ఉంటూ ఎల్లవ్వతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. గమనించిన సాహెబ్‌రావ్ భార్యను మందలించాడు. దీంతో తమకు అడ్డు వస్తున్న భర్తను ఎలాగైనా చంపాలనుకుంది. ప్రియుడు దశరథ్‌తో కలిసి బుధవారం తెల్లవారు జామున సాహెబ్‌రావ్‌పై గొడ్డలి, రాళ్లతో దాడి చేసి పారిపోయారు. ఘటనలో సాహెబ్‌రావ్‌కు తలకు తీవ్రగాయాలు కావడంతో గ్రామస్తులు 108లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్సై ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. హత్యాయత్రానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధితుని సోదరుడు లాండ్గే బాపురావ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వేధింపుల కేసులో ముగ్గురు అరెస్ట్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): అదనపు కట్నం వేధింపులు తాళలేక నవవధువు బలవన్మరణం కేసులో బుధవారం ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపారు. హాజీపూర్ మండలంలోని టీకానపల్లికి చెందిన శృతికి పెద్దంపేట్ గ్రామ పంచాయతీలోని గొల్లపల్లికి చెందిన సాయితో గతనెల 16న వివాహమైంది. అదనపు వరకట్నం తేవాలని ఇటీవల భర్త సాయితో పాటు అత్తామామలు లక్ష్మి, శంకరయ్య వేధింపులకు గురిచేయడంతో ఈనెల 7న మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి కంది శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్ కేసు నమోదు చేయగా మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ కేసు విచారణ ప్రారంభించారు. మృతురాలి భర్త సాయి, అత్తామామలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.